

## వరద నీటిలో చేపల వేట

బీక్కుతండా వాగులో చేపలు పడుతున్న ఆదివాసీ గిరిజన మహిళలు

*బీక్కుతండా గ్రామానికి కొద్ది దూరంలో ఉన్న వాగులో ఆదివారం వరద నీటిలో ఆదివాసీ గిరిజన మహిళలు చేపలు పట్టారు. చిన్నాపెద్దా అనే తేడా లేకుండా చేపలు పడుతూ సరదాగా గడిపారు. కొంతమంది యువకులు గాలాలతో కూడా చేపలు పట్టారు.* - ఇంద్రవెల్లి, జూలై 28



## చేలలో నిలిచిన నీరు

ధన్నూర్ (బీ) సమీపంలో పత్తి చేనులో నిలిచిన వర్షపు నీరు

*ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండడంతో పత్తి, సోయ, కంది చేలలో నీరు నిలుస్తున్నది. వ్యవసాయ పనులకు ఆటంకం ఏర్పడింది. మారుమూల గ్రామాల రోడ్లన్నీ చిత్తడిగా మారాయి. కనీసం పాదచారులు నడవడానికి వీలు లేకుండా పోయింది.* - బోథ్, జూలై 28

# వీడని ముసురు

## ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం

- పది రోజులుగా కనిపించని సూరీడు
- వానలతో చిత్తడిగా మారిన మట్టి రోడ్లు
- అవస్థలు పడుతున్న పల్లె జనం

నిర్మల్, జూలై 28(నమస్తే తెలంగాణ) : వాన వీడడం లేదు. గత శుక్రవారం మొదలైన ముసురు కొనసాగుతూనే ఉన్నది. నిరంతరాయంగా కురుస్తున్న చిరుజల్లులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు చలిగాలులతో కూడిన వర్షం కురుస్తుండడంతో రోజువారి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు, ఇంటికే పరిమితం కావాల్సి వస్తున్నది. పది రోజులుగా సూరీడు ముఖం చాటేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రైతులు వ్యవసాయ పనులు ముందుకు సాగడం లేదంటున్నారు. వరుసగా కురుస్తున్న వర్షాల కారణంగా మారుమూల గ్రామాలకు వెళ్లే మట్టిరోడ్లు చిత్తడిగా మారడంతో అక్కడి ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. తెరిపి ఇవ్వకుండా వర్షాలు కురుస్తుండడం పంటలకు కూడా మంచిది కాదంటున్నారు. మరో నాలుగైదు రోజులు ఇలాగే వర్షాలు కురిస్తే పత్తి, సోయా పంటలకు నీరెత్తి ఎర్రబారిపోయే అవకాశం ఉందంటున్నారు. అలాగే ఈ ముసురు వల్ల పొలాల్లో నీరు నిలిచి నాటు మురిగిపోతుందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. పొలంలో నీరు నిల్వ ఉండకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు చాలా చోట్ల సాధారణం కంటే అధికంగా వర్షపాతం నమోదైంది.



చిత్తడిగా మారిన ఖత్‌గాం రోడ్డు

### ప్రాజెక్టులకు జలకళ

పది రోజులుగా కురుస్తున్న ఓ మోస్తరు వర్షంతో చెరువుల్లోకి పెద్దగా నీరు చేరలేదు. అయితే ఇక్కడ కురుస్తున్న వర్షాలకు తోడు ఎగువన గల ఆదిలాబాద్, మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలతో జిల్లాలోని కడెం, స్వర్ణ ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. ఆయా ప్రాజెక్టులకు క్యాచ్‌మెంట్ ఏరియా అధికంగా ఉండడంతో పాటు ప్రాజెక్టుల్లోకి వచ్చే వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో జలాశయాలు నిండుకుండను తలపిస్తున్నాయి. కడెం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా, ప్రస్తుతం 695 అడుగులకు చేరుకుంది. ఇన్‌ఫ్లో 6,763 క్యూసెక్కులు ఉండగా, ఒక గేటును ఎత్తి 5,138 క్యూసెక్కుల నీటిని దిగువనకు వదులుతున్నారు. అలాగే ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా వానకాలం సాగు కోసం 374 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇదిలా ఉంటే స్వర్ణ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,183 అడుగులు కాగా, ప్రస్తుతం 1,180 అడుగులకు నీటి నిల్వలు చేరుకున్నాయి. దీంతో ప్రాజెక్టు కింది ఆయకట్టు కోసం ఎడమ కాలువ ద్వారా 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అలాగే గడ్డెన్న వాగు కూడా దాదాపు పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరుకున్నది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 358.70 మీటర్లు కాగా, ప్రస్తుతం 356.20 మీటర్లకు నీటి నిల్వలు చేరుకున్నాయి.



బురదమయమైన భైంసా మండలం రంగరివాడ రోడ్డు

### అత్యధిక వర్షపాతం నమోదు

జిల్లా వ్యాప్తంగా ఈ వానకాలం సీజన్‌లో ఇప్పటి వరకు 560.4 మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అయితే గతేడాది ఇదే సమయానికి జిల్లాలో సగటు వర్షపాతం 827.9 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా, ప్రస్తుతం ఇంకా 27 మి.మీ. లోటుగా ఉన్నది. అయితే ఇప్పటి వరకు అత్యధికంగా నిర్మల్‌లో 733.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అలాగే కుభీర్‌లో 521.6, తానూర్‌లో 446.4, బాసరలో 630.6, ముధోల్‌లో 481, భైంసాలో 421.1, కుంటాలలో 505.3, నర్సాపూర్(జి)లో 511.2, లోకేశ్వరంలో 541, దిలావర్‌పూర్‌లో 655.4, సారంగాపూర్‌లో 642.8, నిర్మల్ రూరల్‌లో 549.9, సోన్‌లో 584.8, లక్ష్మణచాందలో 602.9, మామడలో 499.5, పెంబిలో 606.4, ఖానాపూర్‌లో 526.1, కడెంలో 682.7, దస్తురాబాద్‌లో 506.1 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.



## పెన్‌గంగా ఉగ్రరూపం

ఉగ్రరూపంగా ప్రవహిస్తున్న పెన్‌గంగా

*ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ఆయా గ్రామాల వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. మండల సరిహద్దులోని మహారాష్ట్ర ఎగువ ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురువడంతో పెన్‌గంగా నది వరదనీటితో ఉగ్రరూపం దాల్చి ప్రవహిస్తున్నది. గిమ్మ, జైనథ్ గ్రామాల్లోని చెరువులు జలకళను సంతరించుకు న్నాయి. సాత్నాల ప్రాజెక్టులో భారీగా వరదనీరు చెరడంతో ప్రాజెక్టు నిండుకుండలా మారాయి.* - జైనథ్, జూలై 28



## మత్తడికి దుంకుతున్న వాగులు

మత్తడి దుంకుతున్న వాగు

*ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో మండల కేంద్రానికి సమీపంలో గల మత్తడివాగు కల్వర్టు నుంచి వరద నీరు ప్రవహిస్తున్నది. వర్షాల కారణంగా చేలలోకి నీరు వచ్చి చేరడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.* - తాంసి, జూలై 28



## పాతాళ గంగ పైపైకి..

బోరు నుంచి ఉబికి వస్తున్న నీరు

*గిన్నేరా గ్రామ పంచాయతీ పరిధిలోని మర్కాగూడ గ్రామానికి చెందిన జుగ్నాక్ భుజంగ్‌రావ్ వ్యవసాయ భూమిలో వేసిన బోరు నుంచి నిరంతంగా నీళ్లు పారుతునే ఉన్నాయి. ఆదివారం బోరు నుంచి నీళ్లు పైకి ఉబికి వచ్చాయి. పారుతున్న బోరును చూసి గ్రామస్తులు ఆశ్చర్యానికి గురవుతున్నారు.* ఇంద్రవెల్లి, జూలై 28



## వావ్.. వాటర్ ఫాల్స్

వాస్తాపూర్ వాటర్ ఫాల్

*నిర్మల్ జిల్లాలో పది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జలపాతాలు జలకళను సంతరించుకున్నాయి. మామడ మండలంలోని వాస్తాపూర్ వాటర్ ఫాల్ పర్యాటకులను ఆకట్టుకుంటున్నది. పాలనురగలా జాలువారే జలపాతాన్ని చూడడానికి పర్యాటకులు తరలివస్తున్నారు. అలాగే భీంపూర్ మండలంలోని గుంజాల వాగుపై చిరు జలపాతం జలకళతో కనువిందు చేస్తున్నది. మహారాష్ట్ర నుంచి వచ్చే వాగు భీంపూర్ మండలం ధనోరా గుండా గుంజాల వైపు వచ్చి తరువాత పెన్‌గంగలో కలుస్తున్నది. గుంజాల చేల పక్కన ఉన్న ఈ జలపాతం ఎడతెరిపిలేని వర్షాలతో చూపరులను ఆకట్టుకుంటున్నది.* - నిర్మల్ అర్బన్/భీంపూర్, జూలై 28



## మత్తడి వాగుకు జలకళ

మత్తడి ప్రాజెక్టుకు మహారాష్ట్ర నుంచి వస్తున్న వరద

*మహారాష్ట్ర ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో మత్తడి వాగు జలకళను సంతరించుకున్నది. భారీ వర్షాల కారణంగా ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 277.50 మీటర్లు కాగా ప్రస్తుతం 246.50 మీటర్లుగా ఉంది. నీటి నిల్వ 0.458 టీఎంసీలు, ఇన్ ఫ్లో 110 క్యూసెక్కులుగా ఉందని ప్రాజెక్టు జేఈ హరీశ్‌కుమార్ తెలిపారు.* - తాంసి, జూలై 28



## సాత్నాల గేట్లు ఎత్తివేత

సాత్నాల ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తడంతో దిగువనకు వెళ్తున్న నీరు

*భారీ వర్షాలకు సాత్నాల ప్రాజెక్టులోకి వరద నీరు చేరుతున్నది. దీంతో నీటి పారుదల శాఖ అధికారులు ఆదివారం వేకువజామున ప్రాజెక్టు నాలుగు గేట్లలో రెండింటిని ఎత్తి వరద నీటిని దిగువనకు వదిలారు. ప్రాజెక్టు సామర్థ్యం 1.24 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి సామర్థ్యం 0.853 టీఎంసీలుగా ఉంది. ఇన్‌ఫ్లో 1153 క్యూసెక్కులు కాగా.. ఔట్ ఫ్లో 1153 క్యూసెక్కులుగా ఉంది. ప్రాజెక్టు పరిస్థితిని డీఈ శ్రీనివాస్, ఏఈ మారుతి పర్యవేక్షిస్తున్నారు.* జైనథ్, జూలై 28



గుంజాల జలపాతం



బోనాలతో తరలి వెళ్తున్న భక్తులు

# వైభవంగా బోనాల జాతర

ఎదులాపురం, జూలై 28 : ఆషాఢ మాసం బోనాల పండుగను పురస్కరించుకుని ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని అఖిల గాండ్ల తెలికుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో బోనాల జాతర నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం నుంచి ప్రారంభమైన బోనాల శోభాయాత్ర పట్టణ పురవీధుల గుండా అశోక్ రోడ్డులోని పెద్ద పోచమ్మ ఆలయం వరకు కొనసాగింది. ముందుగా బోనాల కుండలను తలపై పెట్టుకుని శోభాయాత్రలో పాల్గొన్నారు. పోతరాజుల విన్యాసాలు, డప్పు చప్పుళ్ల మధ్య డీజే పాటలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ అధ్యక్షుడు భోజారెడ్డి, బీజేపీ నేత పాయల్ శరత్, బీసీ సంఘం అధ్యక్షుడు చిక్కాల దత్తు, ప్రధాన కార్యదర్శి కలాల శ్రీనివాస్, సామాజిక కార్యకర్త బండారి దేవన్న, గాండ్ల సంఘం అధ్యక్షుడు రాజేశ్, ప్రధాన కార్యదర్శి చందు పాల్గొన్నారు.

### బోనమెత్తిన ఎమ్మెల్యే



బోనం ఎత్తుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

తలమడుగు, జూలై 28 : ప్రతి ఒక్కరు భక్తి భవాన్ని అలవర్చుకుని సన్మార్గంలో నడవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని ఆయా గ్రామాల్లో బోనాల పండుగ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సుంకిడిలో బోనాల ఉత్సవాలు నిర్వహించారు. పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా మహిళలతో కలిసి ఎమ్మెల్యే అనిల్ జాదవ్ బోనం ఎత్తుకున్నారు. అలాగే దేవాపూర్, బరంపూర్ గ్రామాల్లో పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# పర్యావరణ రక్షణకు మొక్కలు నాటాలి

**బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్**

నేరడిగొండ, జూలై 28 : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం వడూర్ గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గంలోని అటవీ ప్రాంతంలో ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వర్షాలు సమృద్ధిగా కురవాలన్నా, కలుషితం లేని గాలి అందించాలన్న లక్ష్యంతో కేసీఆర్ హయాంలో హరితహారం కార్యక్రమాన్ని ఓ యజ్ఞంలా చేశారని గుర్తు చేశారు. నియోజకవర్గంలోని జలపాతాల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కుంటాల జలపాతం వద్ద ఏకో టూరిజం ఆధ్వర్యంలో రిసార్ట్ నిర్మాణానికి రూ.3.50 కోట్లు మంజూరయ్యాయని, పనులు కూడా త్వరలో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నేరడిగొండ, బోథ్ ఎఫ్ఆర్వోలు గణేశ్, ప్రణయ్, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, మండల కన్వీనర్ అల్లూరి శివారెడ్డి, సీనియర్ నాయకులు సయ్యద్ జహీర్, ఉపుఇప పోశెట్టి, అంబేకర్ పండరి, దేవేందర్‌రెడ్డి, రాథోడ్ సురేందర్, సద్దాం, పాండురంగ్, ప్రతాప్‌సింగ్, శ్రీకాంత్, నవీన్, కార్తీక్, స్వామి, ఎఫ్ఎస్‌వో ధన్‌సింగ్, ఎఫ్‌బీవో భీంజీ, రాజేందర్, గంగామణి, సిబ్బంది పాల్గొన్నారు.




వడూర్ అటవీ ప్రాంతంలో మొక్క నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్



ఆసిఫాబాద్‌లో లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నార్నూర్, జూలై 28 : నార్నూర్ మండలానికి చెందిన లబ్ధిదారులకు కుమ్రం భీం జిల్లా ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నార్నూర్ మండలానికి చెందిన ముగ్గురు లబ్ధిదారులకు చెక్కులు అందించారు. ఈ కార్యక్రమంలో నార్నూర్ మండల ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఖాసీం, మాజీ సర్పంచ్ జాదవ్ ప్రేమ్, షేక్ చోటు ఉన్నారు.



అరెస్టు చేసి తీసుకెళ్తున్న పోలీసులు

## పాత హైవేపై దోపిడీ దొంగల హల్‌చల్

- రాత్రి వాహనదారులను ఆపి దొంగతనాలు
- అరెస్టు చేసిన పోలీసులు

ఎదులాపురం, జూలై 28 : ఆదిలాబాద్ పట్టణంలోని సీసీఐ క్రాస్ రోడ్డు సమీపంలో పాత హైవేపై శనివారం రాత్రి 11 గంటల ప్రాంతంలో ఒక మహిళ, ఇద్దరు పురుషులు వాహనాలను తాడుతో కింద పడేసి దోచుకుంటున్నారు. ఈ క్రమంలో బాధితులు కొందరితో చెప్పుకున్నారు. సమాచారం తెలిసి రూరల్ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అప్పటికే అక్కడ జనం పోగై ఉన్నారు. పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ మహిళది మహారాష్ట్ర , ఇద్దరు పురుషులది పశ్చిమ బెంగాల్. వీరి వద్ద చిన్న కత్తి, బ్లేడును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాగా.. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని రూరల్ సీఐ ఫణిదర్ తెలిపారు.

## డబుల్ బెడ్రూం లబ్ధిదారుల ర్యాలీ

భైంసా, జూలై 28 : బీఆర్ఎస్ ప్రభుత్వంలో అందించిన డబుల్ బెడ్రూంలను వెంటనే ఇవ్వాలని లబ్ధిదారులు ర్యాలీగా వెళ్లి ఆదివారం ఎమ్మెల్యే రామారావు పటేల్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డబుల్ బెడ్రూంలు ఇవ్వకపోవడం వల్ల కిరాయి ఇంట్లో ఉండి అద్దె డబ్బులు కట్టలేక పోతున్నామని ఆవేదన చెందారు. లక్కీ డ్రా ద్వారా తీసిన డబుల్ బెడ్రూంలను అందివ్వాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులతో చర్చించి అందించేలా చూస్తానని హామీ ఇచ్చారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామారావు పటేల్